క్లుప్తంగా

సమావేశం విజయవంతం చేయండి

భూత్పూర్: జిల్లా కేంద్రంలో 16న జరిగే పార్లమెంట్ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీరాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వితేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంద కృష్ణ మాదిగ వస్తున్నారని వివరించారు. నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం ఆందోళన

జడ్చర్ల టౌన్: కేంద్ర ప్రభుత్వానికి వంతపాడిన ఎస్‌బీఐ చైర్మన్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో బాదేపల్లి బ్రాంచ్ ఎదుట ధర్నా నిర్వహించారు. అఖిలభారత సీపీఎం పిలుపులో భాగంగా జడ్చర్ల శాఖ చేసిన ధర్నాలో ఎలక్టోరల్ బాండ్లను బ్యాంకులు బహిర్గతం చేయాలని నినదించారు. నాయకులు తెలుగు సత్తయ్య, మున్నా, ఈర్లపల్లి యాదయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

15న సమావేశం

గండీడ్: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 15న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దేవన్న సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని.. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు, ఎంపీటీసీలు తదితరులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

జగదీష్ ఎన్నికపై హర్షం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): టీఎన్‌జీఓ నూతన కేంద్ర కమిటీ అధ్యక్షుడిగా మాగం జగదీష్ ఎన్నిక కావడంపై జిల్లా అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్‌లతో పాటు కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో జగదీష్‌ను కలిసి సన్మానించారు.

చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ రూరల్: సర్వేయర్ వెంకటేష్‌పై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్‌లు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోతన్‌పల్లిలో విధి నిర్వహణలో ఉండగా పలువురు ఆయనపై అకారణంగా సర్వేయర్‌పై దాడి చేశారని అన్నారు. కేసు నమోదు చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుసుదన్‌రెడ్డి కోరారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఇంకా రెగ్యులర్ కాని వారిని, జెట్ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్‌చేయాలని కోరారు.

పీఆర్‌సీ ప్రకటించడం హర్షణీయం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం పీఆర్‌సీ ప్రకటించడం హర్షణీయమని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రంజాన్ మాసంలో ఆర్టీసీ ముస్లిం ఉద్యోగులకు ఉదయం డ్యూటీ కల్పించాలని కోరారు.

పరీక్ష ప్యాడ్లు అందజేత

మహబూబ్‌నగర్ క్రైం: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివి మంచి మార్కులు సాధించాలని రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ అన్నారు. రాంరెడ్డి గూడెం బాలికల గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు సోమవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్యాడ్స్ పంపిణీ చేశారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రెడ్‌క్రాస్ తరఫున నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు. ప్రిన్సిపాల్ వాణీ శ్రీ, వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, రమణయ్య, తిరుపతిరెడ్డి, శ్రీహరి, అశ్విని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజాపూర్: అడ్వకేట్ యాదిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల శివారులోని కస్తూర్బా పదోతరగతి విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్లను అందజేశారు. మల్లేపల్లి గ్రామస్తులు భాస్కర్ రెడ్డి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ ఫార్మసీ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఈశ్వర్ కుమార్ బిజూ పట్నాయక్ యూనివర్సిటీ ఆఫ్ ఒడిస్సాను డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆయనను పీయూ వైస్‌ఛాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు నాగభూషణం, బీఎస్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, రవికుమార్, అర్జున్‌కుమార్, తరుణ్, స్వాతి, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జడ్చర్ల బాలికల హాస్టల్స్‌లో వార్డెన్‌గా పనిచేస్తున్న స్వప్నరాణిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో పలు విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. హాస్టల్‌లో స్కాలర్‌షిప్ రాని విద్యార్థులను ఉంచుకుని, వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భానుప్రసాద్, ప్రశాంత్, భరత్, సంతోష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపు అవసరం


కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వర్లు

గండీడ్: గ్రామాల్లో వేసవి కారణంగా నీటి సమస్య రాకుండా చూసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నీటి సమస్య, పారిశుధ్య, ఉపాధి హామీ పథకం, నర్సరీల నిర్వహణ తదితర అంశాలపై ఆయన పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా బాధ్యత గ్రామపంచాయతీలకు వచ్చిందన్నారు. ఇక నుంచి పకడ్బందీగా నీటి సరఫరా గ్రామపంచాయతీలే నిర్వహించాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమయానుసారం నీటిని వదిలేలా కార్యదర్శులు వ్యవహరించాలని, లీకేజీలు లేకుండా అరికట్టేలా పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి గండీడ్ మండలంలో 105 హ్యాబిటేషన్లు ఉండగా దాదాపు 20 చోట్ల నీటి సమస్య ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శులు వివరించారు. కొన్ని గ్రామాల్లో అసలే రావడం లేదని కొన్ని గ్రామాల్లో లక్ష్యం మేరకు సరఫరా జరగడం లేదని కార్యదర్శులు వివరించారు. కాగా నీటి ఎద్దడి నివారణకు నిధులు కేటాయించి సమస్య లేకుండా చూస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో 100 శాతం ట్యాక్సులు వసూలు చేయాలన్నారు. కొన్ని చోట్ల తక్కువగా వసూళ్లు జరిగాయని అలాకాకుండా అన్ని గ్రామాల్లో ఈ 20 రోజుల్లో అంటే ఈనెల చివరి వరకు కచ్చితంగా లక్ష్యం మేరకు వసూలు చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో నర్సరీల నిర్వహణ సక్రమంగా కొనసాగాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించడంతో పాటు షేడ్ నెట్లు సైతం వేయాలని... ఉపాధి పనులు అన్ని గ్రామాల్లో కచ్చితంగా జరిగేలా చూడాలన్నారు. ప్రతి రోజు 100 మంది కూలీలకు తగ్గకుండా చూసుకోవాలని వివరించారు. ఎంపీడీఓ దేవన్న, ఎంపీఈఓ శంకర్ నాయక్, సూపరిండెంట్ ప్రతాప్‌రెడ్డి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన అవసరం

భూత్పూర్: గ్రామీణ ప్రాంతాలల్లో కుష్టు లక్షణాలపై ప్రజలకు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్యాధికారి డా. కృష్ణ అన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న ఇంటింటి సర్వేలో భాగంగా అమిస్తాపూర్‌లో కార్యక్రమాన్ని జిల్లా లెప్రసీ అధికారి జరీనా, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.శంకర్‌లతో కలిసి తనిఖీ చేశారు. ప్రతి ఇంటా తప్పకుండా కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డా. అబ్దుల్ రబ్, సీహెచ్ఓ ఆయూబ్ ఖాన్, హెల్త్ అసిస్టెంట్‌లు ప్రమోద్‌కుమార్, కృపావతి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కృష్ణ

అంగన్‌వాడీల వద్ద సీసీ కెమెరాలు వద్దు


సీడీపీఓకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జడ్చర్ల: అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ప్రభుత్వం సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు సిబ్బంది హాజరుకు సంబంధించి బయోమెట్రిక్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని, డబుల్ సిలిండర్లు లేవన్నారు. మెస్ చార్జీలను పెంచాలని, నాణ్యత కలిగిన సరకులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీడీపీఓ మెహరున్నీసా బేగంకు అందజేశారు. యూనియన్ అధ్యక్షురాలు సరోజ, ప్రభావతి, కమల, జ్యోతి పాల్గొన్నారు.

'ఉపాధి'పై సామాజిక తనిఖీ

భూత్పూర్: మండలంలోని 18 గ్రామ పంచాయతీలో 2021-22 సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సోమవారం సామాజిక తనిఖీకి నిర్వహించారు. డీఆర్‌డీఓ పీడీ నర్సింహులు, అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదాబేగం, ఏపీటీ మంజులతో కలిసి సామాజిక తనిఖీలో భాగంగా సీఆర్పీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 వరకు తనిఖీ కొనసాగింది. మొక్కల పెంపకం, గ్రామీణ క్రీడా ప్రాంగాణాలల్లో చేపట్టిన పనులు, కూలీలకు గాను రూ.3.52 కోట్ల పనులు చేయగా.. క్రీడా ప్రాంగణాలకు రూ. 2.91 కోట్లు, రూ. 61.30లక్షలు మెటీరియల్ కాంపోనెంట్ డబ్బులు చెల్లించారు. కాగా ఉపాధి హామీ సిబ్బంది నుంచి రూ.23,890 రికవరీ చేయగా, రూ.15వేలు పెనాల్టీ చెల్లించాలని డీఆర్‌డీఏ పీడీ నర్సింహులు సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ ప్రభాకర్, ఏపీఓ విమల, కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిసెంట్‌లు పాల్గొన్నారు.


తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

పుస్తకాల పంపిణీ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ నవ నిర్మాణ విద్యార్థి సేన 10వ ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పీయూలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అధ్యక్షుడు శివప్రసాద్ విద్య రంగాన్ని పటిష్టం చేసేందుకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. అంతకుముందు సంఘం జెండాను ఆవిష్కరించారు.

ఆర్థికపరమైన డిమాండ్లు నెరవేర్చాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థికపరమైన డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే నెరవేర్చాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ సోమవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ సంఘాల సమావేశంలో కరువు భృతి, పెండింగ్ బిల్లులపై ముఖ్యమంత్రి పరిష్కారం చేస్తారని భావించామని, కాని వాటిని దాటవేసి ఇతర అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దీంతో సగటు ఉద్యోగికి తీవ్ర నిరాశ మిగిలిందన్నారు.

అక్రమంగా చెరువు నీటి వినియోగం


మోటారు తొలగించడానికి వచ్చిన రైతులు

గండీడ్: చెరువు నుంచి అక్రమంగా నీటిని వాడుతున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగక మోటారును చెరువులో నుంచి తొలగించారు. వివరాల్లోకి వెళితే.. వెన్నాచేడ్ పెద్ద చెరువు నుంచి జక్లపల్లి రైతులు మోటారు వేసి అక్రమంగా నీటిని వాడుకుంటున్నారు. అయితే ఈ ఏడాది నీరు పూర్తిగా తగ్గిపోయింది. ఇప్పుడున్న పంటలకు కూడా పూర్తిస్థాయిలో నీరుపారే పరిస్థితి లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో చెరువు నుంచి నీటిని అక్రమంగా వాడుతుండడంతో వారం కిందట మోటారు తొలగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తొలగించకపోవడంతో ఆగ్రహించిన రైతులు సోమవారం చెరువు దగ్గరికి వెళ్లి మోటారును తొలగించాలని జక్లపల్లి రైతులను కోరారు. వారు అందుకు ససేమిరా అనడంతో బలవంతంగా మోటారు తీసి బయట పడేశారు. మళ్లీ వేస్తే తామే వచ్చి మోటారు ఎత్తుకెళ్తామని హెచ్చరించారు. ఇదే కాకుండా కత్వకాల్వ(పెద్ద కాల్వ)కు కొందరు లింగాయిపల్లి గ్రామస్తులు మోటార్లు వేశారని వాటిని తొలగించేలా చూడాలని వెన్నాచేడ్ రైతులు కోరారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. విషయంపై తహసీల్దార్ నాగలక్ష్మిని వివరణ కోరగా తాము ఇదివరకే మోటార్లు తొలగించాలని సంబంధిత రైతులకు సూచించామన్నారు. ఒకవేళ తొలగించకపోతే తామే వచ్చి తీసుకెళ్తామని చెప్పారు. దీంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వివరించారు.

సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

మహబూబ్‌నగర్ రూరల్: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను యాదాద్రి బ్రహ్మోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో నేలపై కూర్చోబెట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు కుర్చీలపై కూర్చొని కుల వ్యవస్థ పాటించారని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ దుర్మార్గమైన ఘటనను ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. భట్టి విక్రమార్కకు జరిగిన అవమానాన్ని రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం ఖండిస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు దుమార్ల నిరంజన్ పేర్కొన్నారు.

దుశ్యంత్‌రెడ్డికి సన్మానం

నవాబుపేట: డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో దుశ్యంత్‌రెడ్డితో కేక్ కట్ చేయించి, ఘనంగా సన్మానించారు. నాయకులు మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, బాబార్, అజహర్‌అలీ, ఎంపీటీసీ తులసీ రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రీసెర్చ్ మెథడాలజీపై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం రీసెర్చ్ మెథడాలజీ పై విద్యార్థులకు, అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో రీసెర్చ్ ప్రాధాన్యత చాలా పెరుగుతుందని విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ఈపీ 2020లో రీసెర్చ్‌కి ప్రభుత్వం పెద్ద పీటవేసిందన్నారు. ఓయూ అధ్యాపకుడు ప్యాట్రిక్ ఆంటొని, అధ్యాపకులు నాగలక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

మహబూబ్‌నగర్ రూరల్: ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు ప్రస్తుత కాలంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారని డీపీఎం నాగమల్లిక పేర్కొన్నారు. మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో వీఓఏలు, ఈసీ సభ్యులు డీపీఎం నాగమల్లిక, ఎంపీడీఓ కరుణశ్రీ, సలోమి, ఏపీఎం మాధవితో పాటు సీసీలను శాలువలతో ఘనంగా సన్మానించారు. వీఓఏల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆశా కార్యకర్తలతో వివిధ పనులు చేయించుకుని పారితోషికం ఇవ్వకపోవడం తగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. తెలంగాణ హెల్త్ కమ్యూనిటీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపరంగా 2014 నుంచి వారితో చేయించిన వివిధ సర్వేలకు సంబంధించిన డబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కుష్టు సర్వేను బహిష్కరిస్తున్నామన్నారు. ఈ విషయమై డీఎంహెచ్ఓ ఏఓ కొమలమ్మ, కుష్టు నివారణ జిల్లా అధికారి జరీనాబేగానికి వినతిపత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాజ్‌కుమార్, ఆశా కార్యకర్తల సంఘం నాయకురాళ్లు యాదమ్మ, పద్మ, సావిత్రి, అమృత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయికి నివాళి

మహబూబ్‌నగర్ రూరల్: సావిత్రిబాయి పులే సేవలు మరువలేనివని బహుజన మహనీయుల శోభయాత్ర కమిటీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ పాతూరి రమేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని పాతపాలమూరు జైభీమ్ చౌరస్తాలో కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సావిత్రిబాయి మార్గంలో ప్రతిఒక్కరు నడవాలని పేర్కొన్నారు. నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, ఎర్ర నరసింహ, ఆది లక్ష్మయ్య, మహ్మద్ హనీఫ్, బాలయ్య, రవినాయక్, ఖలీల్, లక్ష్మణ్, మెట్టు అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి



అడ్డాకుల: పదో తరగతి విద్యార్థులు భయాన్ని వీడి పరీక్షలకు సిద్ధం కావాలని జిల్లా విద్యాధికారి రవీందర్ సూచించారు. మూసాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న రెండవ ప్రీ ఫైనల్ పరీక్షను ఆయన పరిశీలించారు. తర్వాత విద్యార్థులతో మాట్లాడారు. వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. పదో తరగతి విద్యార్థులు శ్రద్ధతో చదివి మంచి మార్కులు సాధించాలని చెప్పారు. ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాలిక అదృశ్యం

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన బాలిక(17) అదృశ్యమైనట్లు హెడ్ కానిస్టేబుల్ యాదయ్య తెలిపారు. గ్రామానికి చెందిన బాలిక సోమవారం ఉదయం కిరాణ షాపునకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లింది. ఎంతకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అంతటా వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వివరించారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడరాదు

జడ్చర్ల: విద్యార్థులు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సీఐ ఆదిరెడ్డి అన్నారు. నసరుల్లాబాద్ జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎఫ్ఐఆర్, సివిల్, క్రిమినల్ చట్టాలు, బెయిల్ వంటి అంశాలను సవివరంగా తెలిపారు. పోక్సో, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, తదితరాల వాటిపై విద్యార్థులకు వివరించారు. మొబైల్ ఫోన్ల వాడకం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సోషల్‌మీడియాలో వస్తున్న వాటిలో నిజనిజాలను గ్రహించాలని సూచించారు.సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి చిక్కులు కొని తెచ్చుకోవద్దని, ఫేస్‌బుక్, వాట్సాప్, తదితరాలను అవసరం మేరకే వినియోగించాలన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి 1930 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. హెచ్ఎం ప్రేమలత, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శంకర్, హనుమాన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ ఆదిరెడ్డి

కుండలు కాల్చేందుకు స్థలం కేటాయించండి


తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూత్పూర్: కుండలు కాల్చేందుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని జై హనుమాన్ శాలివాహన (కుమ్మరి) సంఘం అమిస్తాపూర్ గ్రామ అధ్యక్షుడు బందెన్న, కోశాధికారి కుమ్మరి ఆంజనేయులు తహసీల్దార్ పి. రాజుకు వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ గ్రామంలో ఇళ్ల మధ్య కుండలు కాల్చుతుండగా కాలుష్యంతో గ్రామస్తుల నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్నామని తమకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సంఘ నాయకులు రాజు, మాధవి, శివసాయి, కాంగ్రెస్ నాయకులు నరేందర్, మట్టి ఆనంద్, శ్రీనివాసులు, మల్లిఖార్జున్, చందర్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

కోయిల్‌కొండ/బాలానగర్: పెబ్బేర్‌లో ఆదివారం జరిగిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో బాలానగర్ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. మొత్తం 16 మంది విద్యార్థులు పాల్గొనగా లక్ష్మీప్రసన్న, నందిని గ్రాండ్ చాంపియన్ షిప్ సాధించారు. ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, పీఈటీ అరుణ, కరాటే మాస్టర్ కృష్ణయ్య తదితరులు విద్యార్థులను సోమవారం అభినందించారు.



నామినేషన్ దాఖలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మహబూబ్‌గనర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తెలంగాణ ఉద్యమకారుడు, మహబూబ్‌నగర్ డెవలప్‌మెంట్ ఫోరం చైర్మన్ మున్నూర్ రవి నామినేషన్ వేశారు. సోమవారం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్‌కు నామినేషన్ పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారానే అనేక ప్రజా సమస్యలు నెరవేరుతాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే స్థానిక ప్రజాప్రతినిధుల సమస్యలు మాత్రం ఎవరికీ పట్టడం లేదన్నారు. రాష్ట్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా తెలంగాణ ప్రజాప్రతినిధుల సమస్యలు గాలికి వదిలేసి.. ఇప్పుడు అన్ని పార్టీలు వారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తుండటం ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు.

బీఆర్‌ఎస్‌ది ముగిసిన అధ్యాయం



స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణలో బీఆర్‌ఎస్‌ది ముగిసిన అధ్యాయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా గొర్రెల పెంపకం సహకార సంఘం చైర్మన్ శాంతన్న యాదవ్, మహబూబ్‌నగర్ వైస్ వైస్ ఎంపీపీ అనిత, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ వసంత నరసింహులుయాదవ్, రాంచంద్రపూర్ ఎంపీటీసీ లావణ్య వెంకటేశ్‌తోపాటు పలువురు కౌన్సిలర్లు, వివిధ వార్డుల నాయకులు, కార్యకర్తలు సోమవారం స్థానిక కార్యాలయంలో పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

'ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'



స్టేషన్ మహబూబ్‌నగర్: ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత మేలు జరిగే అవకాశం ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, నాయకులు ఎన్పీ.వెంకటేశ్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడారు. ముదిరాజులను ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గత పాలకులు ముదిరాజ్‌లను నిర్లక్ష్యం చేశారని అన్నారు. అదే విధంగా బీసీ-ఏలో చేర్చే విషయమై కమిషన్‌ను ఏర్పాటు చేసి పార్లమెంట్ ఎన్నికల్లోపే ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. మంత్రి పొన్నంకు వినతి పత్రం సమర్పించినట్లు వివరించారు.